
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
ఆదివారం 24 మార్చి 2024



క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలి

8లో..

టీబీజీకేఎస్ జెండానే కార్మికులకు అండ..





స్వశక్తి మహిళలకు ఊరట

- నాలుగు మాసాల వడ్డీ డబ్బులు విడుదల
- 7554 సంఘాలకు రూ.6.07 కోట్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్వశక్తి సంఘాల మహిళలకు ఊరట లభించింది. గత ప్రభుత్వ హయాంలో మూడేళ్లుగా వడ్డీలేని రుణాలపై ఇవ్వాల్సిన వడ్డీ డబ్బులు పెండింగులో ఉన్నాయి. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాలుగు మాసాలకు సంబంధించిన వడ్డీ సొమ్మును విడుదల చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గల 7,554 స్వశక్తి సంఘాల మహిళలకు 6 కోట్ల 6 లక్షల 99 వేల రూపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంకా పెండింగులో 68 కోట్ల 66లక్షల రూపాయలు విడుదల చేయాల్సి ఉంది. ఈనెల రెండవ వారంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వశక్తి సంఘాల మహిళా సదస్సును సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను కోటీశ్వరులను చేస్తామని, కోటి రూపాయల వరకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తామని పేర్కొన్నారు. పెండింగులో ఉన్న వడ్డీ లేని రుణాల డబ్బులను విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఆ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన డిసెంబర్ నుంచి మార్చి నెల వరకు నాలుగు మాసాల వడ్డీ సొమ్మును విడుదల చేసింది. ఆ డబ్బులు మహిళా సంఘాల ఖాతాల్లో టి సెర్ప్ విభాగం అధికారులు జమచేస్తున్నారు.

జిల్లాలో 11,383 సంఘాలు ఉండగా, వీటి పరిధిలో 1,19,088 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. తమ కాళ్లపై తాము నిలబడేందుకు 10 నుంచి 15 మంది సభ్యులు కలిసి సంఘంగా ఏర్పాటు చేసుకున్నారు. నెలకు 100 నుంచి 200 రూపాయల వరకు బ్యాంకులో పొదుపు చేస్తున్నారు. పొదుపు చేసిన సొమ్మును తమ అవసరాల కోసం వాడుకుంటారు. రెండేళ్ల క్రమం తప్పకుండా పొదుపు చేసే సంఘాలకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా లింకేజీ రుణాలను ఇప్పిస్తున్నది. 5 నుంచి 10 లక్షల రూపాయల వరకు బ్యాంకు అధికారులు మహిళా సంఘాలకు రుణాలు ఇస్తున్నారు. ఆ సొమ్ముతో కొన్ని సంఘాలకు చెందిన మహిళలు మూకుమ్మడిగా చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోగా, అత్యధిక మంది రుణంగా వచ్చిన సొమ్మును సమానంగా పంపిణీ చేసుకుని స్వయం ఉపాధి పనులు చేసుకుంటున్నారు. ఈ రుణాలను పావలా వడ్డీకే ఇవ్వగా, 2013 నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జీరో వడ్డీకే రుణాలు ఇవ్వడం ప్రారంభించారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత గత ప్రభుత్వం సంఘాలను నిర్వీర్యం చేసింది. సకాలంలో సంఘాలకు వడ్డీ సొమ్ము విడుదల చేయలేదు. మహిళా సంఘాలే నెలనెలా వడ్డీ సొమ్మును చెల్లించి ప్రభుత్వం విడుదల చేసే సొమ్ము కోసం ఎదురు చూస్తూ వచ్చారు. జిల్లాలో ఉన్న సంఘాలకు గడిచిన మూడేళ్లకు సంబంధించి 2023 మార్చి వరకు 65 కోట్ల 51 లక్షల రూపాయలు వడ్డీ రుణాల సొమ్ము మహిళకు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గత ఏడాది మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 9393 మహిళా సంఘాల ఖాతాల్లో 15కోట్ల 99లక్షల 58 వేల రూపాయలు విడుదల చేసింది. ఇందులో 2018-19 సంవత్సరంలో 9124 సంఘాలకు 4 కోట్ల 34 లక్షల 69 వేల రూపాయలు, 2019-20 సంవత్సరంలో 9064 సంఘాలకు 11 కోట్ల 64 లక్షల 89 రూపాయలు మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేశారు. ఈ రెండేళ్లకు సంబంధించి ఇంకా 3 కోట్ల 15 లక్షలు, అన్ని కలిపి 68 కోట్ల 66 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలపై మహిళలు చెల్లించిన సొమ్మును ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు మాసాలకు సంబంధిం చిన సొమ్ము విడుదల చేయగా, పెండింగులో ఉన్న సొమ్మును కూడా విడుదల చేయాలని మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మండలాల వారీగా సంఘాలకు విడుదలైన వడ్డీ(లక్షల్లో)

క్ర. సం.	మండలం	సంఘాలు	డబ్బులు
1.	అంతర్గాం	412	39.51
2.	ధర్మారం	893	59.69
3.	ఎలిగేడు	305	25.82
4.	జూలపల్లి	470	37.41
5.	కమాన్‌పూర్	423	35.31
6.	మంథని	571	41.89
7.	ముత్తారం	415	30.64
8.	ఓదెల	722	54.50
9.	పాలకుర్తి	458	35.96
10.	పెద్దపల్లి	913	82.96
11.	రామగిరి	533	34.94
12.	కాల్వశ్రీరాంపూర్	628	56.45
13.	సుల్తానాబాద్	811	71.91
	మొత్తం	7554	606.99

ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి

- పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య

పెద్దపల్లి రూరల్, మార్చి 23 : రానున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నియోజకవర్గం ఓటర్లంతా సహకరించాలని పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య కోరారు. శనివారం పెద్దపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో పోలీస్ శాఖ, రెవెన్యూ, సమన్వయ కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య, ఏసీపీ కృష్ణలు మాట్లాడుతూ పెద్దపల్లి సెగ్మెంట్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులలో నిరంతరం తనిఖీలు నిర్వహించాలన్నారు. ప్రజలు తమడబ్బు, బంగారం వెంట తీసుకోచ్చుకునే సమయంలో బిల్లులతో పాటు తగిన ఆధారాలను వెంట తెచ్చుకోవాలన్నారు. చెక్ పోస్టులలో అక్రమంగా మద్యం, డబ్బు, క్రీడా వస్తువులు, బంగారం స్వాధీనం చేసుకుంటే దానిని అధికారులు పంచనామా నిర్వహించి ఎన్నికల అధికారులకు అప్పగించాలన్నారు. వీటికి తగిన ఆధారాలు తీసుకోస్తే తిరిగి వారికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్, సీఐ కృష్ణ, ఎస్ఐలు, ఏఎస్ఐలు, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ విజయ్, ఆర్ఐలు నవీన్‌రావు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి : కొప్పుల

గోదావరిఖని, మార్చి 23: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా సమష్టిగా కృషి చేయాలని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. గోదావరిఖని మార్కండేయకాలనీలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూడా ప్రజలు బీఆర్ఎస్‌ను తిరస్కరిస్తే ఓడిపోలేదని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మాయమాటలు చెప్పి గెలిచిందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించిందని, రైతులకు ఎన్నో రకాల ప్రయోజనాలు చేకూర్చిందని, అయినప్పటికీ ప్రజలు ఏదో కొత్త ఆశలతో పార్టీని ఓడించారని ఈశ్వర్ పేర్కొన్నారు. గడిచిన మూడు మాసాల్లోనే కొత్తదనం బూటకమని ప్రజలు తెలుసుకున్నారని, బీఆర్ఎస్‌ను ఓడించినందుకు ప్రజలు పశ్చాతాపడుతున్నారని ఈశ్వర్ అన్నారు. కార్యకర్తలంతా సమిష్టిగా శ్రమిస్తే పెద్దపల్లి పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరడం పెద్ద కష్టమేమి కాదని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు నాయకులు పీటి స్వామి, మురళీధర్‌రావు, జెడ్‌పీటీసీ ఆముల నారాయణ, జేవీ రాజు, కృష్ణవేణి, కవిత సరోజిని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

జూలపల్లి, మార్చి 23 : మండలంలోని ఎస్ఆర్ఎస్‌పీ డి83 ఉపకాలువ 9ఆర్ కాలువకు అనుకుని ఉన్నా ముళ్లపొదలను తొలగిస్తున్న ఉపాధి కూలీలపై శనివారం తేనెటీగలు దాడి చేయడంతో మండల కేంద్రానికి చెందిన మెండె రాజవ్వతో పాటు పలువురు కూలీలు గాయపడ్డారు. ఉపాధిహామీ ఏపీవో సదానందం కూలీలను జూలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన మెండె రాజవ్వను మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు.

ఎండిన పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్



ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని/మంథని రూరల్ మార్చి 23 : సాగు నీరు అందక ఎండిపోయిన పంటలకు ఎకరాని రూ.20 వేల చొప్పున పంట నష్టపరిహారం రైతులకు అందించాలని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మండలంలోని సూరయ్యపల్లి గ్రామ శివారులో ఎండిపోయిన వరి పంటలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు ఎండిపోయిన రైతుల కూడా నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్ష కాలంలో పంటలు సాగు చేసిన రైతులకు యాసంగి పంటకు అవసరమైన సాగునీరు అందిస్తామని ప్రకటనలు చేశారని, ఇక నీళ్లు వస్తాయని ప్రచారం చేయడంతో రైతులు గంపెడంత ఆశతో పంటలు సాగుచేసుకున్నారని అన్నారు. తీరా సమయానికి ఒక్క చుక్క నీళ్ల అందించడం లేదని, నీళ్లు లేక పంటలు ఎండిపోతుంటే రైతులు ఆగమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సాగునీటి ఇబ్బందులు ఉండవని చెప్పిన నాయకులు ఇప్పుడు యాసంగికి నీళ్లు ఇవ్వకుండా రైతులను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా రైతులకు సాగు నీరు అందించడానికి కృషి చేయాలన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఇంజనీరింగ్ అధికారులు

సుల్తానాబాద్, మార్చి 23: వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి మిషన్ భగీరథ పథకం ఇంజనీరింగ్ అధికారులు సరఫరా వ్యవస్థను పరిశీలించారు. శనివారం సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుగోపాల్‌తో కలిసి ప్రజా ఆరోగ్య విభాగం వరంగల్ జోన్ ఎస్ఈ శ్రీనివాస్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఈఈ సంపత్ రావు, మిషన్ భగీరథ ఏఈ సంపత్, మున్సిపల్ ఏఈ సతీష్ తదితరులు సుల్తానాబాద్ పట్టణంలో పర్యటించారు. పట్టణ ప్రజలకు తాగునీటి సరఫరా చేసే వ్యవస్థను వారు పూర్తిగా పర్యవేక్షించారు. వేసవి కాలంలో మంచినీటి సమస్యలు రాకుండా మున్సిపల్ పరిధిలోని ప్రజలందరికీ సకాలంలో తాగునీరు అందించే దిశగా ఎప్పటికప్పుడు ట్యాంకుల పరిశీలన చేపడుతున్నామని అధికారులు తెలిపారు. శనివారం వారు సుల్తానాబాద్ పట్టణంలో జడ్పీ బాలికల హైస్కూల్ ఆవరణలో ఉన్న మంచినీటి ట్యాంకును, ఆర్ అండ్ బీ అతిథి గృహం ఆవరణలోని ట్యాంకును, ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో ఉన్న ట్యాంకులను పరిశీలించారు. ఈ ట్యాంకులు ఎంత నీటి సామర్థ్యం కలిగి ఉన్నాయని, ఒక్కో ట్యాంకు ద్వారా ఎన్ని కాలనీలకు వార్డులకు నీటి సరఫరా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎప్పటికప్పుడు ట్యాంకులను బ్లీచింగ్ పౌడర్ ద్వారా శుభ్రపరుస్తూ స్వచ్ఛమైన తాగునీరును అందించే దిశగా ఎక్కడ లీకేజీలు లేకుండా చర్యలు చేపడుతున్నామని కమిషనర్ వేణుగోపాల్ తెలిపారు. గట్టేపల్లి మానేరు వాగులోగల మంచినీటి సరఫరా వ్యవస్థను పరిశీలించారు. అక్కడి నుంచి అశోక్‌నగర్‌లో గల తాగు నీటి ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకును బావిని పరిశీలించారు.

అలాగే పట్టణ స్పెషల్ ఆఫీసర్ భాస్కరాచారితో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తమకు కేటాయించిన వార్డులలో ఎలాంటి తాగునీటి సమస్యలు తలెత్తకుండా రోజువారీగా పరిశీలించి తెలియజేయాలని సూచించారు.

అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ

- జిల్లా అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాసరావు

కోల్‌సిటీ, మార్చి 23: ప్రజల్లో అవగాహనతోనే సైబర్ నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానంలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సైబర్ నేరస్థులపై నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. మొబైలన్‌లో అనధికార లింకులకు స్పందించరాదన్నారు. ఆధార్ వివరాలు, బ్యాంకు వివరాలు, వ్యక్తిగత వివరాలు ఎవరికి వెల్లడించరాదని పేర్కొన్నారు. సైబర్ నేరాలు జరిగిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో గానీ, 1930 టోల్‌ఫ్రీకు కానీ, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో గానీ ఫిర్యాదు చేయాలని సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఇటీవల జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి కృషి చేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్లను న్యాయమూర్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఆర్ రాజ్‌కుమార్, మున్సిపల్ మెజిస్ట్రేట్‌లు వెంకటేష్, దుర్గం గణేష్, గోదావరిఖని ఏసీపీ మడక రమేష్, సీఐలు ఇంద్రసేనారెడ్డి, అజయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేడ చక్రపాణి, లోక్ అదాలత్ సభ్యుడు శంకర్ పాల్గొన్నారు.

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కోల్‌సిటీటౌన్, మార్చి 23: వామపక్ష ప్రజాతంత్ర పార్టీలపై సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థల దాడులను ఖండిస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం గోదావరిఖనిలోని పార్టీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వైయాకయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఇండియా కూటమిలో ఉన్న వామపక్ష ప్రజాతంత్ర పార్టీలపై ఆర్థిక నేరాలను మోపుతూ వారిపై సీబీఐ, ఈడీ దర్యాప్తు సంస్థలతో దాడి చేయిస్తూ వారి బ్యాంకులను సీజ్ చేయిస్తున్నారన్నారు. దేశంలో ప్రతిపక్షం ఉండకుండా ఎన్నికల్లో జెమిలీ విధానాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం తీవ్రప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించే వామపక్ష ప్రజాతంత్ర పార్టీలపైన కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో దాడులు చేయిస్తూ పార్లమెంట్‌లో వారు స్వేచ్ఛగా అడుగు పెట్టొదని ఉద్దేశ్యంతో అనేక రకాలుగా దేశంలో వివిధ రకాల పేరుతో దాడులు చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మహేశ్వరి, కుమారస్వామి, రమణ, సాగర్, క్రాంతి, భాగ్య, శంకర్, అనూష, హమీద, అంజలి, దీప తదితరులు పాల్గొన్నారు.

గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం : డీఎంహెచ్‌వో

పెద్దపల్లిటౌన్, మార్చి 23: గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రమోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్త్రీ సాధికారిత కేంద్రం సమన్వయంతో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై రాఘవాపూర్, రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ భ్రూణ హత్యలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో అన్ని శాఖలతో కలిసి పనిచేద్దామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం జైలుశిక్షతో జరిమానా విధించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.వి. సుధాకర్‌రెడ్డి, టీబీ ప్రోగ్రాం అధికారి, జెండర్ స్పెషలిస్ట్, సీహెచ్ స్వప్న, డోరకమ్మ, వెంకటేశ్వర్లు, ప్రతాపరెడ్డి, మధుసూధన్, ప్రభాకర్, రాజేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో మరిన్ని సౌకర్యాలు

- జిల్లా కార్యదర్శి ఏవీఎన్ రాజు



పాఠకులను సన్మానిస్తున్న ఏవీఎన్ రాజు

కోల్‌సిటీటౌన్, మార్చి 23: గోదావరిఖనిలోని గ్రంథాలయంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడుతామని గ్రంథాలయ జిల్లా కార్యదర్శి ఏవీఎన్ రాజు అన్నారు. శనివారం ఆయన గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠకులను కలిసి మాట్లాడారు. సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రంథాలయంలో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు, పాఠకులకు సరిపడా ఫర్నీచర్‌ను ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోటీ పరీక్షల నిర్వహణ నేపథ్యంలో మరిన్ని పుస్తకాలు, ప్రత్యేక పత్రికలను అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. జిల్లాలో 16 పబ్లిక్ రీడింగ్ రూమ్స్‌ను ఏర్పాటు చేశామని, అందులో 15 పబ్లిక్ రీడింగ్ రూమ్స్ ప్రారంభించడం జరిగిందన్నారు. పదివేలకు పైగా పోటీ పరీక్షల పుస్తకాలు, 40వేల విలువ గల ఫర్నీచర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి ఒక్కరు గ్రంథాలయాలను వినియోగిం చుకోవాలన్న ఉద్దేశ్యంతో వాటి అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఏవీఎన్ రాజు తెలిపారు. గోదావరిఖని గ్రంథాలయంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతానని పేర్కొన్నారు. గ్రంథాలయాల్లో పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఇటీవల గురుకుల్లో ఉద్యోగాలు సాధించిన గ్రంథాలయ పాఠకులు అడుప అనిల్‌కుమార్, తంగళ్లపల్లి శ్రీలక్ష్మి, కుమ్మరి సువర్ణలను ఏవీఎన్ రాజు శాలువలతో సత్కరించి అభినందించారు. శాఖ గ్రంథాలయం లైబ్రేరియన్ భారతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాఠకు లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని వినతి

పెద్దపల్లి రూరల్, మార్చి 23 : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని శనివారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్‌కు వినతిపత్రం అందించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న టెక్నికల్ అసిస్టెంట్‌లకు గత రెండు నెలలుగా వేతనాలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు పెండింగ్ వేతనాలు చెల్లించేలా ప్రభుత్వానికి తెలియజేయాలని వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంఓల ఏపీవో రమేష్ బాబు, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటేష్, దివ్య, హసన్, సురేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

కొండగట్టు ఆలయ ఈవో సస్పెన్షన్



పి వెంకటేష్

మల్యాల, మార్చి 23: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో పి వెంకటేష్ సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు దేవాదాయ కమిషనర్ హన్మంతరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయంలో టెండర్ల సెక్షన్ అధికారి శ్రీనివాసచారి వ్యాపారుల తమ దుకాణాలు తదితర టెండర్లకు సంబంధించిన సుమారు రూ. 37.90 లక్షల మేర సొమ్ములను స్వాహా చేసినట్లు నెలరోజుల క్రితం తెలియడంతో అతన్ని సస్పెండ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2023-24 సంవత్సరానికి గాను మొదట రూ.37.90లక్షలు దేవస్థానం ఖాతాలో జమ కాకపోవడంతో అధికారులు చర్యలు తీసుకోగా మరోసారి రూ.14.49లక్షలు కూడా వెలుగులోకి రావడంతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి మంగళవారం విచారణ జరిపారు. ఇందులో భాగంగానే గత రెండు రోజుల క్రితం ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్‌తో పాటు సస్పెండ్‌కు గురి అయిన శ్రీనివాసచారికి అడిషనల్ మెమోలు జారీ చేశారు. కాగా ఏడీసీ విచారణ నేపథ్యంలో శనివారం ఈవోపై సస్పెన్షన్ వేటు వేశారు. ఉద్యోగి సొమ్ముల వినియోగంపై ఈవో నిర్లక్ష్యం, అలసత్వంగా పేర్కొంటూ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా దేవాదాయ అసిస్టెంట్ కమీషనర్ చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగించారు. మిగితా బాధ్యులపై కూడా త్వరలోనే చర్యలు ఉండే అవకాశం ఉంది.

సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా చూడండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసిన విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వేములవాడ/ధర్మారం/ధర్మపురి, మార్చి 23: పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నాడు హైదరాబాద్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి శాసనసభ్యుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. సాగునీటి కొరత కారణంగా వేములవాడ, ధర్మపురి నియోజకవర్గాల పరిధిలో పంటలు ఎండిపోయే పరిస్థితి తలెత్తిందని, ఎల్లంపల్లి ప్రాజెక్టు ద్వారా సాగునీటిని అందజేసి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరారు. అదేవిధంగా, ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతన్నలకు ప్రభుత్వం తరపున చేయూతనందించాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఆది శ్రీనివాస్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌కు ఫోన్ చేసి సాగునీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి స్థానిక పరిస్థితులను వివరిస్తూ రైతుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రైతులకు వెంటనే సాగునీరు అందించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకుఈ మేరకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎల్లంపల్లి ప్రాజెక్టు జలాలు వేములవాడ, ధర్మపురి నియోజకవర్గాలకు తక్షణమే అందేలా చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. రైతుల సమస్యలను తెలియజేయగానే సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలిపారు.

శాతవాహన వికల్ప ఓవరాల్ చాంపియన్‌గా 'అల్ఫోర్స్'



ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించిన అల్ఫోర్స్ మహిళా కళాశాల విద్యార్థులు

కరీంనగర్‌రూరల్, మార్చి 23: శాతవాహన యూనవర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేనేజ్‌మెంట్ మీట్ అరోహణ-2024 ఓవరాల్ చాంపియన్ షిప్‌ను అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. కళాశాల ఆవరణలో శనివారం కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అరోహణ-2024లో ఏడు అంశాలకు ఆరు అంశాలలో ప్రతిభ చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోళి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ బి విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా కామదహనం

- రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాలు ప్రారంభం



కామదహనం నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి 23: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శనివారం రాత్రి కామదహనం ఘనంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ నేతృత్వంలో అర్చకులు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ పడమర స్వాగత ద్వారం వెలుపల పిడకలను పేర్చి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కామదహనం చేశారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రాజన్న సన్నిధిలో శివకల్యాణోత్సవాల ప్రారంభానికి ముందు నిర్వహించే త్రిరాత్రి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ అద్దాల మంటపంలో పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీ అనంతపద్మనాభస్వామివారి వారల డోలోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలల్లో ఉంచి డోలోత్సవం నిర్వహించడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు

వేములవాడ, మార్చి 23: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి అనుబంధ ఆలయమైన స్వామి దేవాలయ ప్రాంగణంలోని నవగ్రహ ఆలయంలో శని త్రయోదశి పూజలు ఘనంగా నిర్వహించారు. శనివారం త్రయోదశి కలిసి రావడంతో భక్తులు నవగ్రహ మంటపంలోని శనీశ్వరుడిని తైలంతో అభిషేకించడంతో పాటు నవగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ పూజలలో పాల్గొన్నారు.

అంజన్న సొమ్ములపై అలుసు

- ● కొండగట్టులో టెండర్ల సొమ్ముల దుర్వినియోగం
- ● నెల రోజుల క్రితం బయటపడ్డ రూ.37.90లక్షలు
- ● ఈవో సస్పెన్షన్- పలువురుకి మెమోల జారీ



మల్యాల, మార్చి 23: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో అక్రమాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. తీగ లాగితే డొంక కదిలినట్లు అధికారుల వ్యవహారాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇటీవలే ఆలయంలో టెండర్ల సెక్షన్ అధికారి శ్రీనివాసచారి వ్యాపారుల తమ దుకాణాలు తదితర టెండర్లకు సంబంధించిన సొమ్ములను స్వాహా చేసినట్లు తెలియడంతో అతన్ని సస్పెండ్ చేయగా తాజాగా శనివారం ఈవో వెంకటేష్ కూడా సస్పెన్షన్‌కు గురయ్యారు. 2023-24 సంవత్సరానికిగానూ మొదట రూ. 37.90 లక్షలు దేవస్థానం ఖాతాలో జమ కాకపోవడంతో అధికారులు శ్రీనివాసాచారిపై చర్యలు తీసుకోగా మరోసారి రూ.14.49 లక్షలు కూడా వెలుగులోకి రావడంతో దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ జ్యోతి విచారణ జరిపారు. ఇందులో భాగంగానే రెండు రోజుల క్రితం ఆలయ ఏఈవో బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు సునీల్‌తో పాటు సస్పెండ్‌కు గురి అయిన శ్రీనివాసచారికి అడిషనల్ మెమోలు జారీ చేశారు. ఏడీసీ విచారణతో ఈవో నిర్లక్ష్యం బయటపడడంతో అతడినీ సస్పెండ్ చేశారు. త్వరలోనే మిగితా బాద్యులందరీపై దేవాదాయశాఖ చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

● ఆడిట్ అభ్యంతరాలపైనా నిర్లక్ష్యం..

కొండగట్టులో అక్రమాలు జరుగుతున్నప్పటికీ పట్టించుకునే వారే లేక పోవడంతో లక్షల్లో అంజన్న సొమ్ములు దుర్వినియోగానికి గురవుతున్నట్లు తెలుస్తోంది. పది సంవత్సరాలుగా అడిట్ అధికారులు ఇచ్చే నివేదికలపై చర్యలు ఉండడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2007-18 కాలంలో దాదాపు రూ.14 కోట్లకు సంబంధించి ఆడిట్ అధికారులు పలు అభ్యంతరాలు తెలుపగా రెండు కోట్ల వరకు అవకతవకలు జరిగినట్లు అందులో దాదాపు రూ.13లక్షలు అప్పటి అధికారులు చెల్లించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. అయితే ఆడిట్ అధికారులు ప్రతి ఏటా అభ్యంతరాలు తెలుపడం, వాటిని పట్టించుకోకపోవడంతోనే అక్రమాలు కొనసాగుతన్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

● రిజిష్టర్లను తీసుకెళ్లిన ఏడీసీ..

కొండగట్టులో ఇటీవల జరిగిన రూ.37.90లక్షల దుర్వినియోగంపై విచారణకు వచ్చిన దేవాదాయ శాఖ ఏడీసీ జ్యోతి మరింత లోతైన విచారణ కోసం 2018 నుంచి గల వివిధ ముఖ్యమైన రిజిష్టర్లు, క్యాష్‌బుక్, డీసీబీ, ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదికలు తీసుకెళ్లగా అక్కడ విచారణ జరుపుతుండడంతో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో దేవస్థానం అధికారుల్లో వణుకు మొదలైంది. అయితే పలు బ్యాంక్ స్టేట్‌మెంట్లు పంపించాలని కోరగా ఇప్పటి వరకు అధికారులు పంపినట్లు సమాచారం.

ప్రస్తుతం రూ.52.39 లక్షల దుర్వినియోగ వ్యవహారంలో ఈవో సస్పెండ్‌కు గురి కాగ మిగితా అధికారులపై త్వరలోనే చర్యలకు ఉపక్రమిస్తున్న నేపథ్యంలో 2018-19 సంవత్సరానికిగాను మరో రూ.17.61 లక్షలు కూడా బ్యాంక్ ఖాతాలో జమ చేయనట్లు చర్చించుకుంటున్నారు. అయితే బ్యాంక్ ఖాతాల వివరాలు పరిశీలించకుండా జమ చేయనట్లు పేర్కొనడం సరికాదని ఈ సందర్భంగా అధికారులు కొట్టి పారేస్తున్నారు. దేవాదాయ శాఖ అధికారులు పదేళ్ల కాలంగా ఇక్కడి ఆర్థిక లావాదేవీలపై ప్రత్యేక అధికారి నేతృత్వంలో విచారణ జరపాలనే డిమాండ్లు వెల్లువెతుతున్నాయి.

ముగిసిన టాస్క్ శిక్షణ

గణేశ్‌నగర్, మార్చి 23: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జి సెంటర్ ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) వారి సహకారంతో డెటాబేస్, ఎస్క్యుఎల్ పైన ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి శ్రీలక్ష్మి తెలిపారు. టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శోభారాణి, ట్రైనర్ బి స్వప్న పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 23: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని విదిశలో ఈ నెల 23 నుంచి 27 వరకు జరగనున్న జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా పైడిపల్లిలో ఈ నెల 8 నుంచి 10వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు బి సాయికృష్ణ, ఎం చంద్రదీప్, ఎం చంటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బాసరవేని లక్ష్మణ్ తెలిపారు. క్రీడాకారులను డీవైఎస్‌వో శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కాసర్ల ఆనంద్‌కుమార్, రమణరావు, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం సంయుక్త కార్యదర్శి ఎస్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేశ్ అభినందించారు.

భజన పోటీల్లో ప్రథమ బహుమతి

చొప్పదండి, మార్చి 23: శంకరపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి భజన పోటీల్లో చొప్పదండికి చెందిన శ్రీ హనుమాన్ భజన మండలికి ప్రథమ బహుమతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 భజన బృందాలు పోటీలో పాల్గొనగా శ్రీహనుమాన్ భజన మండలి సభ్యులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.10,000ల నగదు బహుమతిని అందుకున్నారు. చొప్పదండికి చెందిన చీకట్ల లచ్చయ్య ఉత్తమ గాయకుడిగా ఎంపికై రూ.1,016 నగదు బహుమతి అందుకున్నారు. పోటీల్లో చీకట్ల లచ్చయ్య, డోలక్ రాజు, పిట్టల రఘుమోహన్, దండే కొమురయ్య పాల్గొన్నారు.

బాలికలపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

- ఒక్కో కేసులో రూ. 5వేల చొప్పున జరిమానా - బాధితులకు మూడు లక్షల చొప్పున పరిహారం

జగిత్యాల, మార్చి 23(ఆంధ్రజ్యోతి): ముగ్గురు బాలికలపై అత్యాచారం చేసిన నిందితుడికి ఒక్కో కేసులో 20 ఏళ్ల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కో కేసులో రూ. 5 వేల చొప్పున జరిమానాతో పాటు ఒక్కో బాధితురాలికి రూ. మూడు లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని జగిత్యాల కోర్టు న్యాయాధికారి నీలిమ శనివారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపల్లి మండలం దట్నూరు గ్రామానికి చెందిన కొడిమ్యాల హరికృష్ణ అలియాస్ హరీష్ అనే వ్యక్తి గ్రామంలో కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. నిత్యావసర సరుకుల కోసం దుకాణానికి ఒంటరిగా వచ్చే బాలికలను టార్గెట్‌గా చేసుకుని ట్రాప్ చేయడం ప్రవృత్తిగా మార్చుకున్నాడు. బాలికలకు మాయమాటలు చెబుతూ తన ఫోన్ ఇస్తూ గేమ్స్ ఆడుకునేలా చేసేవాడు. అనంతరం ఫోన్‌లో ఉన్న అశ్లీల వీడియోలను, చిత్రాలను చూపిస్తూ లైంగిక దాడికి పాల్పడేవాడు. బెదిరింపులకు పాల్పడుతూ బైక్‌పై ఎక్కించుకుని రహస్య ప్రాంతాలకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడేవాడు. భయభ్రాంతులకు గురి చేసి విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడేవాడు. ఇలా ముగ్గురు బాలికలపై హరికృష్ణ లైంగిక దాడికి పాల్పడినట్లు, వికృత చేష్టలను గమనించిన ఓ వ్యక్తి జరిగిన విషయాన్ని బాలికల తల్లిదండ్రులకు సమాచారం అందించాడు.

దీంతో బాలికల తల్లులు 2022 ఏప్రిల్ 7వ తేదీన గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై శ్రీధర్ రెడ్డి విడివిడిగా కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ ప్రకాష్, సీఐ కోటేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాల త్రిపుర సుందరి కేసు వాదించగా కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. విచారణ చేపట్టిన న్యాయాధికారి నేరం రుజువు కావడంతో మూడు కేసులకు విడివిడిగా తీర్పు వెలువరించారు. ముద్దాయికి ఒక్కో కేసులో 20 సంవత్సరాల చొప్పున జైలు శిక్షతో పాటు ఒక్కో కేసులో ఐదు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. బాధిత బాలికలు ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల చొప్పున పరిహారం చెల్లించాలని శనివారం తీర్పు ఇచ్చారు.

ఆర్టీసీ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీక్ష

భగత్‌నగర్, మార్చి 23: కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి వినోద్‌కుమార్ శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీజియన్‌లలో లాభనష్టాలు, రానున్న నూతన ఆర్థిక సంవత్సరంలో లాభాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. రాబోయే వేసవి దృష్ట్యా బస్‌స్టేషన్‌లలో పరిశుభ్రమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. మేడారం జాతరకు తగినన్ని బస్సులు నడిపించి విజయవంతం చేసినందుకు అభినందించారు.

ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు డిసాలమన్, వెంకన్న, జె శ్రీలత, జానీరెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ కె సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, ఎ విలాస్‌రెడ్డి, సుగుణాకర్, కె యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల దిగ్బంధానికి వ్యూహరచన

- గడ్చిరోలిలో మూడు రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల సమావేశం

- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పకడ్బందీ వ్యూహం



మూడు సరిహద్దు రాష్ట్రాల సమావేశానికి హాజరైన పోలీస్ ఉన్నతాధికారులు

గోదావరిఖని, మార్చి 23: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. మూడు రాష్ట్రాల పోలీస్ యంత్రాంగం ఏకముఖంగా మావోయిస్టులను కట్టడి చేయడం, వాళ్ల కదలికలను నియంత్రించడం, పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించడం లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. శనివారం గడ్చిరోలి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. గడ్చిరోలి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ అంకిత్ గోయల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. రామగుండం పోలీస్ కమిషనర్(ఐజీ) ఎం శ్రీనివాస్ సమావేశానికి అధ్యక్షత వహించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలు, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, జాగ్రత్తలపై చర్చించారు. ప్రధానంగా మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా పెంచాలని, సంబంధిత సమాచారాన్ని మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంత పోలీసులు పరస్పరం చేరవేసుకోవాలని నిర్ణయించారు. తద్వారా మావోయిస్టులను కట్టడి చేయడం సులభమవుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశం, నిష్క్రమణ మార్గాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పకడ్బందీ తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించారు. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎన్‌బీడబ్ల్యూ వారెంట్ల విషయంలో, నేరాల కట్టడి, కేసుల విషయంలో కూడా ఒకరికొకరు సహకరించుకోవాలని చర్చించారు. ఈ సమావేశంలో పోలీస్ ఉన్నతాధికారులు సీఆర్‌పీఎఫ్ డీఐజీ(ఆపరేషన్) జగదీష్ ఎన్ మీన, గడ్చిరోలి ఎస్పీ నిలోత్పల్, ఐపీఎస్ అధికారులు నిఖిల్ పింగ్లే, ఎస్పీ గోండియా, కిరణ్ కరే, ఎస్పీ భూపాలపల్లి కిరణ్‌ఖారే, ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్‌కుమార్, డీసీపీ(మంచిర్యాల) అశోక్‌కుమార్, ఏడీఎస్పీ గడ్చిరోలి(అడ్మిన్) కుమార్ చింత, అదనపు ఎస్పీ(ఆపరేషన్) యతీష్‌దేశ్‌ముఖ్, పలువురు పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో భక్త జన సందడి




లక్ష్మీనరసింహ స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు, వేంకటేశ్వర స్వామి వారల సేవ ఊరేగింపులో పాల్గొన్న అతిథులు

ధర్మపురి, మార్చి 23: ధర్మపురి క్షేత్రంలో భక్త జనం సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సంఖ్య శనివారం అధికమయ్యింది. ఉదయం నుంచే భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు, సేవా సంస్థ సభ్యులు క్యూలైన్లు వద్ద తాగునీటిని అందించారు. తొక్కిసలాట జరగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో సిబ్బంది బందోబస్తు చర్యలు చేపట్టారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడో రోజు ఆలయానికి రూ 6,99,038 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 2,51,902 ప్రసాదాలు విక్రయించగా 3,66,900 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ. 80,236 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించారు.

● వేంకటేశ్వరస్వామి వారల సేవ ఊరేగింపు

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాత్రి వేంకటేశ్వర స్వామి వారల సేవలను అశ్వ వాహనంపై ఊరేగించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు లక్ష్మీనృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, అర్చకులు, నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పక్కన ఆరు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య, నిత్యాన్న సత్రం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు రవీందర్ పాల్గొన్నారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24 న ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణిలో పాత నారసింహస్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళా వేదికపై రాత్రి నృత్య ప్రదర్శన, భక్తి సంగీత విభావరి, హరికథ కాలక్షేపం ఉంటుందని ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

80 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 23: మండలంలోని ఖాసింపేట గ్రామశివారు నుంచి వాహనంలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 80 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

జమ్మికుంట రూరల్, మార్చి 23: జమ్మికుంట పట్టణంలోని రిలియన్స్ పెట్రోల్ పంపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులు శనివారం గాయాలపాలయ్యారు. ఎంగేటి సంపత్ అనే యువకుడు తన స్నేహితుడు ఎం శరత్‌తో కలిసి ద్విచక్రవాహనంపై జమ్మికుంట వైపు వస్తున్నారు. అదే సమయంలో తనుగుల గ్రామానికి చెందిన తిరుపతి అటువైపుగా ద్విచక్రవాహనంపై వచ్చాడు. రిలియన్స్ పెట్రోల్ పంపు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సంపత్, శరత్‌లకు గాయాలయ్యాయి. తిరుపతి అనే వ్యక్తి అజాగ్రత్తగా నడిపి తమ కుమారుడి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడని బాధితుడి తండ్రి మదనయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో తిరుపతిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

సిరిసిల్ల క్రైం, మార్చి 24: ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. జిల్లాలో వారం రోజులుగా పలువురు సైబర్ నేరస్థుల వలలో చిక్కి రూ. 5.03లక్షలు మోసపోయారని ఎస్పీ తెలిపారు. శనివారం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వేములవాడ పట్టణంలో స్టాక్ మార్కెట్ పేరుతో ఓ బాధితుడికి ట్రేడింగ్ యాప్‌లో ఇన్వెస్ట్ చేయాలని చెప్పగా వెంటనే రూ. 2.77లక్షలు పంపి మోసపోయాడన్నారు. ఇదే విధంగా సిరిసిల్ల పట్టణంలో ఓ బాధితుడు సోషల్‌మీడియాలో పెన్సిల్ ప్యాకింగ్‌లో పార్ట్‌టైం జాబ్ ఆడ్‌చూసి వెంటనే నమ్మి రూ. 15వేలు పంపి మోసపోయాడన్నారు. మరో వైపు సిరిసిల్లలో ఓ బాధితుడికి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని గుర్తుతెలియని వ్యక్తి నుంచి కాల్ చేసి చెప్పగా ఓటీపీ షేర్ చేయడంతో సైబర్ నేరగాళ్ల ఖాతా నుంచి రూ. 1.70లక్షలు కొల్లగొట్టారని ఆయన తెలిపారు. ఇల్లంతకుంట మండల పరిధిలో ఓ బాధితుడు పార్ట్‌టైం జాబ్ కోసం వెతుకుతుండగా వాట్సాప్‌కు మెసెజ్ రావడంతో స్పందించి టాస్క్ పేరుతో కొంత పెట్టుబడి పెట్టాలని చెప్పగా వెంటనే 41వేల రూపాయలు పంపి మోసపోయాడన్నారు. సైబర్ నేరగాళ్ల ఆశ, భయం అనే రెండు అంశాల మీద అమాయక ప్రజలు మోసపోతున్నారన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవద్దని, సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా ప్రజలు ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే హెల్ప్‌లైన్ 1930కి, డయల్ 100కు కాల్‌చేసి తెలియజేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఆల్‌ఇండియా పోలీస్‌మీట్‌లో కరీంనగర్‌కు కాంస్య పతకం



హెడ్‌కానిస్టేబుల్ సత్యంను అభినందిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, మార్చి 23: హైదరాబాద్‌లోని పుల్లెల గోపీచంద్ బాడ్మింటన్ అకాడమీలో జరిగిన 16వ ఆల్‌ఇండియా పోలీస్‌మీట్‌లో కరీంనగర్ కమిషనరేట్‌లో కోర్టు డ్యూటీ నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ మచ్చ సత్యం కాంస్య పతకం సాధించారు. 55 సంవత్సరాల విభాగంలో పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా సత్యంను శనివారం పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి అభినందించారు.

ఇసుక లారీ పట్టివేత

జమ్మికుంట రూరల్, మార్చి 23: జమ్మికుంట మండలం విలాసాగర్ మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఆశోక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

ఎలక్ట్రికల్ దుకాణం దగ్ధం

జగిత్యాలరూరల్, మార్చి 23: జగిత్యాల మండలంలోని ధరూర్ గ్రామంలో శ్రీరామ్ ఎలక్ట్రికల్, సానిటరీ దుకాణం షార్ట్‌సర్క్యూట్ సంభవించి దగ్ధమైంది. ధరూర్ గ్రామానికి చెందిన అజయ్ ధరూర్ గ్రామంలో ఎలక్ట్రికల్, సానిటరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్న సమయంలో దుకాణం మూసివేసి తన ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలోనే ప్రమాదశాత్తు దుకాణంలో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దుకాణం యజమాని ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్‌ఇంజిన్ వచ్చి మంటలు ఆర్పివేశారు. దుకాణంలో సుమారు నాలుగు లక్షలల రూపాయలు నష్టపోయినట్టు బాధితుడు అజయ్ తెలిపారు. సంఘటనకు గల వివరాలను పోలీసులు సేకరించారు.

వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం

కాల్వశ్రీరాంపూర్, మార్చి 23: మండలంలోని మొట్లపల్లి లో నిర్మించే నూతన దేవాలయాల వద్ద తమ స్వంత డబ్బు లతో గర్రెపల్లి సంపత్ కుమార్, మనోహర్ వెంకటేశ్వర్లు దయానంద్, రత్నాకర్‌లు వాటర్ ప్లాంట్ నిర్మాణం పనులు చేపట్టారు. మాజీ సర్పంచ్‌లు తుల మనోహరావు, గోనె శ్యామ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

రామగిరి, మార్చి 23: జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల లో వారం రోజులుగా కొనసాగుతున్న బి-జోన్ స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ముగిసాయి. విజేతలకు ఎస్‌బీఐ రిజినల్ బ్యాంక్ మేనేజర్ అనుపమ్ ఆదర్శ్ ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇంజనీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా చైర్మన్, సింగరేణి అడిషనల్ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, ప్రాజెక్టు ఇంజనీర్ చంద్రశేఖర్, రిజినల్ బ్యాంకు మేనేజర్ పీయూష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత లేకుండా చర్యలు

ముత్తారం, మార్చి 23: మండలంలోని గ్రామాల్లో వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలతో జాగ్రత్త పడాలని ప్రత్యేక అధికారి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లలిత అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. డీపీవో శంకర్, ఎంపీడీవో లలిత, ఎంపీవో వేణుమాధవ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలో వేసవి తాగునీటిపై గ్రామాల్లో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శైలజ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ సెక్రటరీలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ముందుస్తుగా సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించుకోవాలన్నారు. మిషన్ భగీరథగ్రిడ్ ఏఈ వంశీ, ఎంపీవో సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది ర్యాలీ

ఎలిగేడు, మార్చి 23 : మండల కేంద్రంలోని శనివారం క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. క్షయవ్యాధి అంటువ్యాధితో సమానమని, జాగ్రత్తలు తీసుకొని సోకకుండా ఉండాలని, పరీక్షలు చేసుకొని వైద్యుల సూచనల మేరకు మందులు వాడాలని డాక్టర్ నిస్సిక్రిస్టియాన తెలిపారు. కార్యక్రమంలో విజేందర్ రాజు, లక్ష్మణ్, రాజేశ్వరి, నాగరాణి వివిధ గ్రామాల ఏఎన్ఎం, ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో పెసర విత్తనాలు

ఓదెల, మార్చి 23 : పెసర పంట సాగుకు ఆసక్తి ఉన్న రైతులకు విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏఈవో సంధ్య తెలిపారు. డబ్ల్యుజీజీ 42 రకం పెసర విత్తనాలు పెద్దపల్లి, కాల్వ శ్రీరాంపూర్ ప్యాక్స్ సొసైటీలో ఉన్నాయని, కావలసిన రైతులు తమ భూముల పాస్ పుస్తకాలు, అలాగే ఆధార్ కార్డుల జిరాక్స్ కాపీలను వెంట తీసుకెళ్లాలని తెలిపారు.

ముందస్తు హోలీ వేడుకలు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 23 : హోలీ పండుగను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని విద్యాసంస్థల్లో శనివారం సంబరాలను జరుపుకున్నారు. ట్రినిటి బీఈడి శిక్షణ కళాశాలలో చాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు రంగులు పూసుకుంటూ హోలీ ఆడారు. ట్రినిటి ప్రైమరీ, గాయత్రి విద్యాసంస్థలలో హోలీ ముందస్తు సంబరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ పాఠశాలల కరస్పాండెంట్‌లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ధర్మారం, మార్చి 23: ధర్మారం మండలం కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో శనివారం ముందస్తుగా విద్యార్థులు హోలీ పండగ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటు ఆనందంగా హోలీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా హోలీ పండగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎచ్ఎం నూతి మల్లయ్య, ఉపాధ్యాయులు రాపర్తి రోజా, పొన్నం సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మంథని రూరల్, మార్చి 23: మంథని మండలంలోని నాగపెల్లి శివారులో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గద్దల సమ్మయ్య(34) మృతిచెందాడు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం వీరాపూర్ గ్రామానికి చెదిన సమ్మయ్య మంథని మండలం గోపాల్‌పూర్‌లోని తన బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా అడవిసోమన్‌పల్లి రహదారిపై నాగేపల్లి పరిసరాల్లో కల్వర్టును ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. బైక్‌పై వెనక కూర్చున్న సమ్మయ్య తమ్ముడు సతీష్‌కు స్వల్ప గాయాలు అయినట్లు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన వారిని కాపాడిన పోలీసులు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 23: గోదావరి నది బ్రిడ్జి మీద నుంచి ఆత్మహత్య చేసుకునేందుకు శనివారం నదిలో దూకే ప్రయత్నం చేసిన ఇద్దరిని పోలీస్ సిబ్బంది పట్టుకుని కాపాడారు. నస్పూర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి కార్మికుడు అడుకాపురం రాజయ్య అనారోగ్య కారణాలతో, గోదావరిఖనికి శ్రీనివాస్ అనే వ్యక్తి ఆర్థిక సమస్యలతో గంట వ్యవధిలో ఆత్మహత్య చేసుకునేందుకు ఒకరి తర్వాత ఒకరు బ్రిడ్జి మీద నుంచి దూకే ప్రయత్నం చేశారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్ఎస్‌టీ సిబ్బంది ఇద్దరిని పట్టుకుని కౌన్సెలింగ్ ఇచ్చి ఇళ్ళకు పంపించి వేశారు.

క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలి

అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ



ర్యాలీ తీస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



అవార్డు అందుకుంటున్న శంకర్

పెద్దపల్లిటౌన్, మార్చి 23: జిల్లాలో క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని అదనపుకలెక్టర్ అరుణశ్రీ వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో పనిచేస్తున్న క్షయ నివారణ సిబ్బంది, రాఘవాపూర్, రాగినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి కలెక్టరేట్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ అరుణశ్రీ మాట్లాడుతూ క్షయవ్యాధిని మార్చి 2025 వరకు నిర్మూలించేందుకు క్షేత్రస్థాయిలో పని చేసే ఏఎన్ఎం, ఆశాలదే ముఖ్య భూమిక ఉంటుందన్నారు. క్షయవ్యాధి లక్షణాల గురించి ప్రభుత్వ అందిస్తున్న సేవల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీ కార్యకర్తల, స్వయంసహాయక బృందాల సహాయంతో అవగాహన కార్యక్రమాలను ముందుకు తీసుకపోవాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో కె. ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ వారానికి మించి దగ్గు ఉన్నవారు, ఆకస్మికంగా బరువు తగ్గినవారు, రాత్రి సమయంలో జ్వరం రావడం, చెమటలు పట్టడం, అలసట, చాతి నొప్పి, రక్తంతో కూడిన తెమడ రావడంలాంటి లక్షణాలను క్షయవ్యాధిగా అనుమానించి తెమడ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డోరకమ్మ, యస్ వెంకటేశ్వర్లు, జిల్లా నోడల్ పర్సన్ ప్రతాపరెడ్డి, ఏ మధుసూదన్, ప్రభాకర్, రాజేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

పెద్దపల్లిటౌన్, మార్చి 23: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శనివారం పెద్దపల్లి టీబీ యూనిట్ చికిత్స పర్యవేక్షకులు దేవ తిరుపతికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. తన కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కె.ప్రమోద్ కుమార్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ కె.సుధాకర్‌ల చేతుల మీదుగా ఉత్తమ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్, మార్చి 23: క్షయవ్యాధి నిర్మూలనలో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఐసీటీసీ కన్వీనర్‌గా పని చేస్తున్న శంకర్‌కు బెస్ట్ ఫర్ఫార్మెన్స్ అవార్డు లభించింది. శనివారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ శంకర్‌కు అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

దొంగల ముఠా అరెస్ట్

జ్యోతినగర్, మార్చి 23: రామగుండం కమిషనరేట్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి కాపర్ వైర్ చోరీ చేస్తున్న దొంగల ముఠాలోని ఐదుగురు సభ్యులను ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం ఏసీపీ మడత రమేష్ వివరాలు వెల్లడించారు. గోదావరిఖనికి చెందిన కొంత మంది ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు.గౌతమీ నగర్ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న గుర్రాల చంటి, గుర్రాల మనోజ్, గుర్రాల సుధాకర్, గుర్రాల రాజేష్, కోట వంశీలను విచారించడంతో ఈ విషయం బయ టపడింది. వారి నుంచి లక్ష రూపాయల విలువైన కాపర్ వైర్, ఆటో, బైకులు స్వాధీనం చేసుకున్నారు. మరో నలుగురు పరారీలో ఉన్నారు. ముఠా సభ్యుల ను పట్టుకోవడంలో శ్రమించిన రామగుండం సీఐ అజయ్‌బాబు, ఎస్సై ఉదయ్ కిరన్, పోలీసు సిబ్బంది మల్లికార్జున్, అంజయ్య, దుబాసి రమేష్, జే రమేష్‌ల ను ఏసీపీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్వేచ్ఛాయుతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- గోదావరిఖని ఏసీపీ మడత రమేష్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ రమేష్, పోలీసులు

మంథని మార్చి 23: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలంతా తమ ఓటు హక్కును స్వేచ్ఛాయుత వాతావరణంలో వినియోగించుకోవాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ కోరారు. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకొని అంబేద్కర్ చౌరస్తా నుంచి గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో మంథని పోలీసులు శనివారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మడత రమేష్ మాట్లాడుతూ యువత వాట్సాప్ గ్రూపుల్లో ఇతరులను రెచ్చగొట్టే పోస్టులు పెట్టరాదన్నారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలిగిన తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు వెంకటకృష్ణ, రాణివర్మ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న తాండ్ర సదానందం



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న పీవైఎల్ నాయకులు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 23 : కామ్రేడ్ భగత్‌సింగ్ వర్ధంతి సభ జిల్లా కేంద్రంలో అఖిలభారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ తాండ్ర సదానందం, జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ మాచర్ల అంజి, తాళ్లపల్లి సురేందర్, ఆసాల నవీన్, నాయకులు బండారి సదానందం ,రాకేష్ ,కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా మండలంలోని కనగర్తిలో శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో క్రొవ్వత్తులతో ఘనంగా నివాళులు అర్పించారు. ఏవైఎఫ్ నాయకులు తాళ్ళపెల్లి సురెందర్, రమేష్, ఓదెలు, పోచయ్య, కొమరయ్య, మహేష్, కొలిపాక శ్రీనివాస్, సారయ్య, లెనిన్, భరత్, కిరణ్ పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్ : బ్రిటీష్ ప్రభుత్వం దోపిడీని ఎండగట్టడంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ పాత్ర మరువలేనిదని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కాసిపేట ధర్మేందర్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు ఈ నరేష్ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా గోదావరిఖనిలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు 23ఏళ్ల వయసులో ఉరికంభాన్ని ముద్దాడిన వీరయోధులని, వారిని ఆదర్శంగా తీసుకుని వారి బాటలో నడవాలని పిలుపునిచ్చారు.

కాగా, స్వతంత్ర సంగ్రామంలో ఉరి తాడును ముద్దాడిన యోధడు సర్దార్ భగత్‌సింగ్ అని సీపీఐ నగర కార్యదర్శి కనకరాజు అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 93వ వర్ధంతి సందర్భంగా స్థానిక భాస్కర్‌రావు భవన్ నుంచి చౌరస్తా వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌతం గోవర్ధన్, మడ్డి ఎల్లయ్య, గోషిక మోహన్, మార్కపురి సూర్య, తాళ్లపల్లి మల్లయ్య, మాదన మహేష్, నవీన్, శివ, సుధీర్, శ్రీను పాల్గొన్నారు

యైటింక్లయిన్‌కాలనీ : ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమం జరిగింది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ అశోక్ భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాజేశ్వరి, స్వామి, ప్రకాష్, లింగయ్య, మదునమ్మ పాల్గొన్నారు.

జ్యోతినగర్ : భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా శనివారం ఎన్టీపీసీలో న్యూడెమొక్రసీ శ్రేణులు కాగడాల ప్రదర్శన నిర్వహించాయి. పార్టీ జిల్లా నాయకుడు చిలుక శంకర్ మాట్లాడారు. దేశం కోసం యుక్త వయస్సులో ఉరికంబాన్ని ఎక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానం స్ఫూర్తిగా దేశ అభివృద్ధికి యువత తమవంతు కృషి చేయాలని అన్నారు. మోదీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలను తిప్పి కొట్టి, మత రాజకీయాలకు చరమగీతం పాడేలా యువతరం ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.



కాగడాల ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

పేదల కోసమే బీజేపీ సంక్షేమ పథకాలు



లబ్ధిదారులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

మార్కండేయకాలనీ, మార్చి 23: పేదల కోసమే బీజేపీ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లబార్థి సంపర్క్ అభియాన్ కార్యక్రమం శనివారం గోదావరిఖని విఠల్‌నగర్ మండలం 36వ డివిజన్ తిలక్‌నగర్‌లో పార్టీ నాయకులు నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని లబ్ధిదారులు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ విఠల్‌నగర్ జోన్ మండల అధ్యక్షుడు అడ్డురి రాజేష్, లబార్థి సంపర్క్ అభియాన్ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, ప్రధాన కార్యదర్శి మామిడి రాజేష్, డివిజన్ ఇన్‌చార్జి సల్ల వేణురెడ్డి, మామిడి సంపత్, అరిగెల శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యురాలు సోమారపు లావణ్య ఆధ్వర్యంలో 39 డివిజన్ ప్రగతినగర్‌లో కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకురాలు రామ, స్వరూప, సుధాశ్రీ, అంజలి, రమ అధిక సంఖ్యలో మహిళలు, బీజేపీ నాయకురాలు పాల్గొన్నారు.

వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

మార్కండేయకాలనీ, మార్చి 23: రామగుండం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక లయన్స్ భవన్‌లో 30 మంది వికలాంగులకు ఉచిత కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షులు తానిపర్తి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి బంక కళావతి, కోశాధికారి మనిషా అగర్వాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ ముద్దసాని ప్రమోద్ కుమార్‌రెడ్డి హాజరై వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మేడిశెట్టి గంగాధర్, బంక రామస్వామి, డాక్టర్ వెంకటేశ్వర్లు, తానిపర్తి గోపాలరావు, మనోజ్ కుమార్ అగర్వాల్, డి లక్ష్మారెడ్డి, పోకల ఆంజనేయులు, వి ఎల్లప్ప, బేణిగోపాల్ త్రివేది పాల్గొన్నారు.

ఖమ్మంపల్లిలో పారిశుధ్య పనులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న డీపీవో శంకర్

ముత్తారం మార్చి 23: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంతో పాటు అన్ని గ్రామాల్లో డిపివో శంకర్ ఆధ్వర్యంలో మురికి కాలువలు శనివారం పరిశుభ్రం చేయించారు. ఈ నెల 17న 'అధ్వాన్నంగా మురికి కాలువలు పట్టించుకోని అధికారులు' అనే కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మురికి కాలువలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఖమ్మంపల్లి, సీతంపేట అడవి శ్రీరాంపూర్, ఓడేడు, ముత్తారం, కేశనపల్లి, పారుపల్లి మైదాబండ, పోతారం హరిపురం,లక్కారం తదితర గ్రామపంచాయతీలలో ప్రత్యేక అధికారుల తోపాటు డీపీవో సమక్షంలో మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

'కాకా కుటుంబాన్ని విమర్శించే హక్కు లేదు'

గోదావరిఖని, మార్చి 23: పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి పచ్చి అవకాశవాది అని, ఎన్నికలప్పుడు కనబడే గోమాసే ఇష్టం వచ్చినట్టు మాటాడడం సరైంది కాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుమ్మడి కుమారస్వామి అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలప్పుడు వచ్చే గోమాసే ఏ రోజు కూడా పెద్దపెల్లి పార్లమెంట్ గురించి ఆలోచించింది లేదని, బీజేపీ స్థానిక నాయకులను కాదని గోమాసేకు టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. వెంకటస్వామి కుటుంబాన్ని విమర్శించే నైతిక హక్కు గోమాసే శ్రీనివాస్‌కు లేదని, వెంకటస్వామి కుటుంబం పేదల కోసం సహాయం అందించారని, మంత్రి శ్రీధర్‌బాబు వెంట తిరిగిన శ్రీనివాస్ మంత్రిపైన కూడా ఇష్టం వచ్చినట్టు విమర్శలు చేశారని, దీన్ని సహించేది లేదన్నారు. సమావేశంలో పంజా శ్రీనివాస్, చంద్రమోహన్, గడ్డం సతీష్, మూర్తి పాల్గొన్నారు.

కుట్టు శిక్షణపై అవగాహన సదస్సు

పెద్దపల్లి రూరల్, మార్చి 23: మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ కేంద్రంలో కుట్టు శిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. టైలరింగ్ శిక్షణ పొంది ఉపాధి పొందే మహిళలను స్కూల్ పిల్లలకు యూనిఫామ్స్ కుట్టడానికి గుర్తించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెద్ద మొత్తంలో క్లాత్ కట్టింగ్ మిషన్లతో క్లాత్ కట్టింగ్ చేయడంపై రిసోర్స్ పర్సన్ అంజలి శిక్షణ ఇచ్చారు. అలాగే మహిళా సాధికారత ఫైనాన్షియల్ లిటరసీ సంధ్య మహిళలకు ఆర్థిక అంశాలపై అవగాహన కల్పించారు. డీఆర్‌డీఓ రవీందర్, ఏడిఆర్‌డి ఓ రవికుమార్ శిక్షణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం కల్యాణి, జిల్లా సమైఖ్య అధ్యక్షులు సరస్వతీ, మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయ అరుణ, మహిళలు పాల్గొన్నారు.

సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలి

కమాన్‌పూర్,మార్చి 23: గర్భిణీలు, బాలింతలు పోషకాహార ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీడీ రవూఫ్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జరిగింది. చిన్నారులకు అన్నప్రాశన, అక్షరాభ్యాసం, గర్భిణీలకు శ్రీమంతంతో పాటు తల్లులకు పోషకాహార విలువలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడం వల్ల పండంటి బిడ్డకు జన్మనిస్తారన్నారు. ప్రతినెలా పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి పిల్లల బరువు, ఎత్తు పెరిగేలా తల్లులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తల్లులు ఉన్నారు.

పోచమ్మ ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మార్చి 23: గోదావరిఖని భగత్‌సింగ్‌నగర్‌లో పోచమ్మతల్లి గుడిలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మక్కాన్‌సింగ్, మనాలీ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్వినిప్రకాష్, నాయకులు నెలకంటి రాము, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కళ్యాణ్‌నగర్, మార్చి 23: ముదిరాజ్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రగతి మత్స్య కార్మిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉత్సం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు సంక్షేమ పథకాలను అందించాలని, రాష్ట్రంలో 65లక్షల మంది ముదిరాజ్‌లు ఉన్నారని, దమాషా ప్రకారం ముదిరాజ్‌ల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో సబ్బు మల్లయ్య, బర్ల మల్లయ్య, పిట్టల ఇస్తారి, సాంబయ్య, ఓదెలు, చిగురు సాయి, రామస్వామి, లక్ష్మీనారాయణ, మధు, సదానందం పాల్గొన్నారు.



గెలిపిస్తే సంస్థ అభివృద్ధి, కార్మికుల శ్రేయస్సుకు కృషి

- బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



కార్మికులతో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

గోదావరిఖని, మార్చి 23: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే సింగరేణి అభివృద్ధి కోసం, కార్మికుల శ్రేయస్సుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం జీడీకే 11ఇంక్లైన్ గనిలో ఆయన ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గని కార్మికుల కష్టాలు, బాధలు చూసి అనుభవించానని, కేంద్ర స్థాయిలో సింగరేణి సంస్థను ప్రైవేటీకరణ దిశగా వెళ్లకుండా కాపాడుకునేందుకు తనను గెలిపించాలన్నారు. మీ ఇంటి బిడ్డగా తనను ఆశీర్వదించాలని ఈశ్వర్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ జెండానే కార్మికులకు అండ..

- రాజకీయాలకు అతీతంగా నిలబడుదాం.. - వర్కింగ్ కమిటీ సమావేశంలో మిర్యాల రాజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, మార్చి 23: కార్మికుల హక్కుల సాధనలో రెండు దశాబ్దాలుగా పోరాడుతున్న గులాబీ జెండానే కార్మికులకు అండగా నిలబడుతుందని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డి పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖని తిలక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో టీబీజీకేఎస్ నాయకుడు నూనె కొమురయ్య అధ్యక్షతన జరిగిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడారు. కార్మిక హక్కుల సాధనకు అవిశ్రాంతంగా పోరాడుతున్న అలాంటి సంస్కృతి కలిగిన టీబీజీకేఎస్‌ను లేకుండా చేయడం ఎవరితరం కాదన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీబీజీకేఎస్ అత్యంత కీలక భూమిక పోషించిందని, 4కోట్ల తెలంగాణ ప్రజలకు మార్గదర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా కార్మిక సంఘాన్ని పునర్నిర్మాణం చేస్తున్నామన్నారు. గని స్థాయి నుంచి కేంద్ర కమిటీ వరకు పటిష్టమైన నాయకత్వాన్ని నియమించుకుని ఎగిసిలేస్తామని చెప్పారు. సింగరేణి గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మిక సమస్యలను వదిలిపెట్టి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. టీబీజీకేఎస్ పునర్నిర్మాణంతో పాటే సింగరేణి కార్మిక హక్కుల సాధన పోరాటాలను, సంక్షేమ చర్యలను అమలును ఎజెండాగా అవిశ్రాంతంగా పని చేస్తామన్నారు. గుర్తింపు సంఘంగా పని చేసిన 11సంవత్సరాల కాలంలో 75హక్కులను సాధించి పెట్టామని ఆయన వివరించారు. ఈ సమావేశంలో 11డివిజన్ల నుంచి సుమారు 120మంది టీబీజీకేఎస్ ప్రతినిధులు హాజరయ్యారు. ఇందులో మల్‌రాజ్ శ్రీనివాస్, మంగీలాల్, బడికెల సంపత్‌కుమార్, మేడిపల్లి సంపత్, మంద మల్లారెడ్డి, పెట్టం లక్ష్మణ్, పర్లపల్లి రవీందర్, వడ్డేపల్లి శంకర్, జాహెద్‌పాషా, ఐలి శ్రీనివాస్, మాదాసు రామమూర్తి, నాగెపల్లి సాంబయ్య, పింగిలి సంపత్‌రెడ్డి, బడికెల సమ్మయ్య, రత్నం అవినాష్, కాపు కృష్ణ, శ్రీనివాసరావు, వీరభద్రం, కిరణ్‌కుమార్, రంగనాథ్, రామకృష్ణ, ముక్కంటి ప్రభాకర్‌రావు, నాగెల్లి శ్రీరావు, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

● కేంద్ర నాయకుల రాజీనామాల ఆమోదం...

శనివారం గోదావరిఖనిలో జరిగిన టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో టీబీజీకేఎస్‌కు గతంలో రాజీనామా చేసిన అధ్యక్షుడు బీ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్యల రాజీనామాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ రాజీనామాలను వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదించింది. సంఘం స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా మిర్యాల రాజిరెడ్డిని ఎన్నుకున్నారు. నూతన కేంద్ర నాయకత్వాన్ని ఎన్నుకునే వరకు యూనియన్ కార్యకలాపాలను, పునర్నిర్మాణాన్ని స్టీరింగ్ కమిటీ నిర్వహించనున్నది.